సిద్ధార్థ ఫ్లై ఓవర్‌కు మోక్షం

- రూ. 2 కోట్లతో మిగిలిపోయిన పనుల నిర్వహణకు చర్యలు
- నిధుల సమీకరణలో ఎమ్మెల్యే పార్థసారథి కృషి



అసంపూర్తిగా ఉన్న ఫ్లై ఓవర్

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ కాలేజీ వద్ద అసంపూర్తిగా ఉన్న ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. దాదాపు రూ. 2 కోట్లతో మధ్యలో నిలిచిపోయిన ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేయటానికి ప్రణాళిక సిద్ధం చేశారు. పనులన్నీ సకాలంలో పూర్తి చేస్తే మూడు నెలల్లో ఫ్లై ఓవర్ వినియోగంలోకి వస్తుంది.

వివరాలు ఇవి..

పటమట పంపింగ్ స్కీం ఉన్నకాలంలో పంట కాలువ ఉండేది. అయితే పటమట పంపింగ్ స్కీం మూసివేయటంతో పంటకాలువను రోడ్డుగా అభివృద్ధి చేశారు. పటమట ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి పెనమలూరు పోలీస్‌స్టేషన్ వరకు పంటకాలవను రోడ్డుగా మార్చారు. దీంతో ఈ రోడ్డుకు పంట కాలువ రోడ్డుగా పేరు వచ్చింది. అయితే పెనమలూరు పోలీస్‌స్టేషన్ నుంచి తాడిగడప వందడుగుల రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ రోడ్డు సిద్ధార్థ కాలేజీ ప్రాంగణంలో నుంచి వెళ్తండటంతో అక్కడ రోడ్డు నిర్మాణం చేస్తే విద్యార్థులకు సమస్యలు తలెత్తుతాయని యాజమాన్యం అభ్యంతరం తెలిపింది. అది ప్రభుత్వ స్థలమే అయినా యాజమాన్యం ఒప్పుకోలేదు. ఈ విషయమై సీఆర్డీఏ, యాజమాన్యంకు వివాదం రావటంతో చివరకు పంటకాలువపై ఫ్లై ఓవర్‌ను కాలేజీ తన సొంత నిధులతో నిర్మాణం చేస్తామని ముందుకు వచ్చి అప్పటి టీడీపీ ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది.

ఫ్లై ఓవర్ నిర్మాణం..

ఒప్పందం ప్రకారం సిద్ధార్థ యాజమాన్యం దాదాపు రూ. 12 కోట్లు వెచ్చించి పంటకాలువపై ఫ్లై ఓవర్ నిర్మాణం చేసింది. 350 మీటర్ల పొడవు, 40 అడుగుల వెడల్పుతో మూడున్నర సంవత్సరాల క్రితం ఫ్లై ఓవర్ నిర్మాణం చేసింది. అయితే సీఆర్డీఏతో ఉన్న ఒప్పందం ప్రకారం ఫ్లై ఓవర్‌పై వాహనాల రాకపోకల సమయంలో శబ్ద కాల్యుష్య నివారణకు సౌండ్ బ్యారియర్స్ సీఆర్డీఏ ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే ఫ్లై ఓవర్ కింద డ్రెయినేజీల నిర్మాణం చేయాలి. అయితే ఎంవోయూ ప్రకారం సీఆర్డీఏ పనులు చేయలేదని ఆరోపిస్తూ కాలేజీ యాజమాన్యం ఫ్లై ఓవర్‌పై తారు రోడ్డు వేయక పోవటంతో పనులు అసంపూర్తిగా ఉండి పోయాయి.

రూ. 2 కోట్లతో పనులు..

ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లై ఓవర్ ఆవశ్యకత ఏర్పడటంతో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి రంగంలోకి దిగారు. తాడిగడప మునిసిపాలిటీ రూ. 50 లక్షలు, సీఆర్డీఏ రూ. 50 లక్షల నిధులతో సౌండ్ బ్యారియర్స్ ఏర్పాటుకు టెండర్ పిలిచారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ నుంచి తాడిగడప 100 అడుగుల రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్‌కు రూ. 40 లక్షలు మునిసిపాలిటీ మంజూరు చేసింది. డ్రెయినేజీ నిర్మాణానికి మునిసిపాలిటీ మరో రూ. 40 లక్షలు నిధులు కేటాయించింది. కాలేజీ యాజమాన్యం కూడా రూ. 30 లక్షలతో ఫ్లై ఓవర్ పై తారు రోడ్డు వేయటానికి ముందుకు వచ్చింది. ఈ నిధులు సమీకరించి పనులు చేయటానికి ఆయా శాఖల అధికారులతో పాటు కాలేజీ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే పార్థసారథి కృషి చేయటంతో ఫ్లై ఓవర్ పనులకు మార్గం సుగమం అయింది.

త్వరలో పనులు చేపడతాం..



సిద్ధార్థ ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేయటానికి నిధులు మంజూరు చేశాం. టెండర్ ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే పనులు చేపడతాం. ముందుగా సౌండ్ బ్యారియర్స్ పనులు చేస్తాం.

– డాక్టర్ ఎన్.ప్రకాశరావు, కమిషనర్, డాక్టర్ వైఎస్సార్ తాడిగడప

క్లుప్తంగా

అందివస్తున్న సాంకేతికతపై అవగాహన అవసరం



పెనమలూరు: సివిల్ ఇంజినీరింగ్‌లో అందివస్తున్న సాంకేతికతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు అన్నారు. కాలేజీలో 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రివిట్ వర్కుషాపు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అనంతరం మాట్లాడుతూ భవనాలు, రహదారుల నిర్మాణంలో సాంకేతికత దేశ అభివృద్ధికి దోహదపడతాయన్నారు. మారుతున్న టెక్నాలజీని విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించటానికి రివిట్ సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో విజయవాడ కాంటర్ క్యాడ్ డైరెక్టర్ కె.నాగు, డాక్టర్ కోగంటి శ్యామ్‌ప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి జలమయం



పెనమలూరు: పోరంకి ప్రాంతంలో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి జలమయమైంది. మండల పరిధిలో గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో జాతీయ రహదారి బందరు రోడ్డుపై అడుగు ఎత్తున నీరు నిలిచిపోయింది. దీని కారణంగా ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారి నిర్మించిన సమయంలో ఇరు పక్కల డ్రెయినేజీలు నిర్మాణం చేయలేదు. దీని కారణంగా వర్షం చినుకు పడితే పోరంకి సెంటర్‌లో జాతీయ రహదారి జలమయమవుతుంది. డ్రెయినేజీల నిర్మాణం చేపడతామని ఎన్‌హెచ్ఐ అధికారులు ప్రకటనలు చేసినా నేటి వరకు డ్రెయినేజీల నిర్మాణం ఊసే లేదు. పోరంకితో పాటు తాడిగడప సెంటర్, కామయ్యతోపు, పప్పుల మిల్లు, పెనమలూరు సెంటర్‌లలో నిత్యం ఇదే సమస్య తలెత్తుతోంది. నీరు నిలిచి పోవటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. జాతీయ రహదారి పై నీరు నిలవకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ఐ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థికి అభినందన



పెనమలూరు: జాతీయ స్థాయి రోలర్ హాకీలో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి సుజిత్ పాల్గొన్నాడు. ఈ మేరకు కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ రఘు గురువారం వివరాలు తెలుపుతూ తమ కాలేజీలో ఈఐఈ 2వ సంవత్సరం చదువుతున్న యుజిత్ ఇటీవల నాగ్‌పూర్‌లో జరిగిన 17వ జాతీయ రోలర్ హాకీ పోటీల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించాడని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్ విద్యార్థి సుజిత్‌ను అభినందించారు. కార్యక్రమంలో సివిల్ హెడ్ చావా శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: స్థానిక పల్లిపేటలో వినాయకచవితి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన మండపంలో ప్రతి రోజు స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి గణపతిస్వామివారికి గరిక పూజ చేశారు. అమ్మవారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. నేడు స్వామివారి మండపంలో సరస్వతీ పూజ చేసి చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తామని నిర్వాహకుడు అండ్రాజు శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా ముగిసిన గణపతి ఉత్సవాలు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న గణపతి ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదాన్ని చిగులూరి శ్రీనివాసరావు రూ.86,500కు దక్కించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. భక్తులంతా కలిసి గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం

కంకిపాడు: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని తెన్నేరు శివారు కోమటి గుంట గ్రామంలో రూ. 6 లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత రహదారుల పనులను గురువారం ప్రారంభించారు. అనంతరం నిర్మాణ తీరు తెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. నిధులు సద్వినియోగం అయ్యేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. అభివృద్ధిని చూసి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జుజ్జువరపు ఎలీషా, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, నాయకులు దండాబత్తిన సుబ్బారావు, రామకృష్ణ, ముసిబోయిన మోహనకృష్ణ ఈఓ సువర్ణలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు

డీసీపీ విశాల్‌గున్ని

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యాధరపురం ఆర్టీసీ డిపో సమీపంలోని మినీ స్టేడియంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐదో విడత వైఎస్సార్ వాహన మిత్ర పథకం విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రానుండటంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గురువారం సభా ప్రాంతంలో పోలీసు అధికారులు, సిబ్బందితో డీసీపీ సమావేశమై బందోబస్తు విధులపై మార్గదర్శకాలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం హాజరయ్యే కార్యక్రమానికి సభా ప్రదేశం, పరిసర ప్రాంతాల్లో 1200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖులకు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌బీ ఏడీసీపీ జీవీ రమణమూర్తి, ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, పశ్చిమ ఏసీపీ కె.హనుమంతరావు, ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమైన డీసీపీ విశాల్‌గున్ని

విశ్వకర్మ యోజనను వినియోగించుకోండి

బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజనను చేతి వృత్తిదారులు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్తి వెంకటేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గొల్లపూడి పరిధిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గురువారం వెంకటేశ్వరి ఆధ్వర్యాన జరిగిన విశ్వకర్మ యోజన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈ పథకం ద్వారా వివిధ వృత్తుల్లో ఐదు రోజులపాటు శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందజేయడమే కాకుండా బ్యాంక్‌ల ద్వారా రూ.15వేల నుంచి రూ.3లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తారని తెలియజేశారు. ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ మాట్లాడుతూ విశ్వకర్మ యోజన పథకంలో శిక్షణ పొందిన చేతి వృత్తిదారులు తయారు చేసిన ఉత్పత్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెటింగ్ చేసి వారి ఉపాధి కల్పనకు సహకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు ముండూరు సత్యవతి, విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం నాయకురాలు సుతారి నవత, కలికోట విజయలక్ష్మి, విజయవాడ విశ్వబ్రాహ్మణ యువజన విభాగం అధ్యక్షులు చిట్టూరి హరీష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోలేటి శ్రీకాంత్‌ను వెంకటేశ్వరి సత్కరించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న పూర్వ గవర్నర్ లయన్ దామర్ల శ్రీశాంతి

పామర్రు: మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరితే ఆయా కుటుంబాలు సుభిక్షంగా ఉంటాయని లయన్స్ జిల్లా 316డి పూర్వ గవర్నర్ లయన్ దామర్ల శ్రీశాంతి అన్నారు. పామర్రు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా ఉచిత కుట్టు శిక్షణ శిబిరం మొదటి బ్యాచ్ ముగింపు కార్యక్రమం గురువారం స్థానిక లయన్స్ క్లబ్ సేవా భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీశాంతి పాల్గొని మాట్లాడుతూ మహిళలు వృత్తి విద్యలైన కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడర్, బ్యూటీషియన్ కోర్సులు, కంప్యూటర్ శిక్షణ పొందాలని చెప్పారు. అప్పుడే వారు ధైర్యంతో బతుకుతూ కుటుంబ పోషణకు మార్గం ఏర్పాటవుతుందని తెలిపారు. గౌరవ అతిథిగా మాజీ లయన్స్ క్లబ్ గవర్నర్ మూల్పూరి ఉపేంద్ర మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, ఆరోగ్యంగా ఉంటేనే ఇటు సమాజం అటు సంసారం సుభిక్షంగా ఉంటుందన్నారు. క్లబ్ సభ్యులు సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయటం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసిన 162 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. ఇద్దరు పేద మహిళలకు కుట్టుమిషన్‌లను ఉచితంగా అందజేశారు. పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లయన్స్ జిల్లా నేతలు బీవీ అప్పారావు, కె.చంద్రశేఖర్‌రావు, పామర్రు యూనియన్ బ్యాంక్ మేనేజర్ జి.శేషగిరిరావు, సబ్ మేనేజర్ వసుధ బసవేశ్వరరావు, లయన్స్ రీజియన్ నేతలు తోట రమేష్, లంకపల్లి శ్రీనివాసరావు, సెక్రటరీ ఎం. మధుసూదనరావు, శిక్షకురాలు సుగ్గున జ్యోతి పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికలు

పమిడిముక్కల: జెడ్పీ పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ సెక్రటరీ తోట అజయ్‌కుమార్, నేషనల్ హాకీ ప్లేయర్ తిరుమణి మురళి ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లాల నుంచి అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలను రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక చేస్తామని వ్యాయామ ఉపాధ్యాయుడు ఇమ్మడి నారాయణ తెలిపారు.

ఘనంగా హనుమంతుడి జన్మనక్షత్ర పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమంతుడి జన్మనక్షత్రం పూర్వాభాద్రను పురస్కరించుకుని గురువారం అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో గుర్రం జాషువా జయంతి

ఉంగుటూరు: సామాజిక ప్రయోజనం కోసం నూతన ఒరవడితో తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కల్పించిన నవయుగ కవి గుర్రం జాషువా ఆదర్శనీయుడని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులుగా చేసేందుకు జాషువా చేసిన రచనలకు భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం, కవి కోకిల, కవి దిగ్గజ నవయుగ కవి చక్రవర్తి వంటి బిరుదులను అందుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో మిలాద్ ఉన్ నబి

కంకిపాడు: మిలాద్ ఉన్ నబీని ముస్లింలు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్తను స్మరిస్తూ గురువారం గోసాల సెంటర్‌లోని మదీనా మసీదులో మిలాద్ ఉన్ నబీ ఘనంగా నిర్వహించారు. తొలుత మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. అనంతరం భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మసీదు పేష్‌మామ్ మహమ్మద్ ఆరీఫ్, మసీదు ప్రెసిడెంట్ షేక్ సుభాని, ప్రతినిధులు అబ్దుల్ రషీద్, అబ్దుల్ రవూఫ్, మసీదు పెద్దలు పర్యవేక్షించారు.

నున్న(విజయవాడరూరల్): మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం పలు గ్రామాల్లో ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరిలో శాంతిని తీసుకురావాలని మహ్మద్ ప్రవక్త జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని సన్మార్గంలో నడుస్తూ, ఆయన బోధనలను సార్థకం చేయాలని మత గురువులు పేర్కొన్నారు. నున్న గ్రామంలో చెరువు సెంటర్ మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో మత గురువు షాజిత్ పాల్గొన్నారు. గ్రామంలో వాగు సెంటర్ మసీదులో, పి.నైనవరం గ్రామంలోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు



కంకిపాడు: రక్షిత తాగునీటి సరఫరాకు సమర్థంగా చర్యలు తీసుకుంటున్నామని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో రూ. 2.50 లక్షలు అంచనా వ్యయంతో ఎస్సీ కాలనీలో కొత్త బోరు నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ చంద్రశేఖర్ మాట్లాడుతూ పాత బోరు నుంచి మురుగునీరు వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను గుర్తించిన పంచాయతీ పాలకవర్గం కొత్త బోరు ఏర్పాటుకు పంచాయతీ నిధులు నుంచి రూ. 2.50 లక్షలు అంచనా వ్యయంతో చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలోనే కొత్త బోరు నుంచి సురక్షిత తాగునీటిని సరఫరాకు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఉప్పులేటి శ్రీనివాసరావు, వేమూరి చిన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామ పంచాయతీగా గన్నవరాన్ని తీర్చిదిద్దాలి



పాలకవర్గ సభ్యులు, అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వంశీ

గన్నవరం: గన్నవరం గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సూచించారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యంగా ఉన్న స్థానిక కోనాయి చెరువు వద్ద ఆర్ అండ్ బీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు త్వరితగతిన పనులను చేపట్టాలని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేయని ఎల్ఈడీ లైట్ల స్థానంలో కొత్త లైట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి మార్కెట్ వరకు సెంట్రల్ డివైడర్‌పై మొక్కలు ఏర్పాటు చేయడంతో పాటు సుందరీకరించాలని చెప్పారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి గ్రామ పరిధిలోని డ్రైన్లలో పూడికతీత, మరమ్మతు పనులు చేపట్టాలని తెలిపారు. దీనికోసం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో పాటు అదనంగా కూలీలను ఉపయోగించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంతో పాటు ఎక్కడా చెత్తా చెదారం లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అన్ని గృహాలకు, అపార్ట్‌మెంట్‌లకు తాగునీరు పూర్తిస్థాయిలో పంపిణీ చేసే విధంగా నీటి వనరులను మెరుగుపరచాలని చెప్పారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాసరనేని గోపాలరావు, సర్పంచి నిడమర్తి సౌజన్య, మాజీ సర్పంచి నీలం ప్రవీణ్‌కుమార్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కోమటిగుంట గ్రామంలో సంక్షేమ పాలన గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

- కోమటిగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం
- సంక్షేమ పాలన వివరించిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామ శివారు కోమటిగుంట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోమటిగుంట-తెన్నేరు ప్రధాన రహదారి అభివృద్ధి జరగక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక యువత, మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. అంతర్గత రహదారులు, సంక్షేమ పథకాల లబ్ధి, పెండింగ్ అంశాలను దృష్టికి తెచ్చారు. వీటిపై ఎమ్మెల్యే పార్థసారథి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడారు. పెండింగ్ సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు. రహదారి అభివృద్ధి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడతామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హులకు అన్యాయం జరగకుండా పథకాలు అందేలా బాధ్యతతో అధికారులు పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన ప్రతి గడపకూ తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. బాధ్యతారాహిత్యమైన ప్రతిపక్షం రాష్ట్రంలో ఉందని ఆరోపించారు. ప్రజా సమస్యలు, పాలనలో లోపాలు ఎత్తి చూపకుండా ప్రభుత్వంపై బురదచల్లటమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ జుజ్జువరపు ఎలీషా, ఎంపీటీసీ ఉప్పలూరి శాంతి, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, కమ్మ, సగర కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నక్కా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సీహెచ్ ఆదర్శకుమార్, పిన్నబోయిన శ్రీనివాసరావు, నాయకులు దండాబత్తిన సుబ్బారావు, రామకృష్ణ, మట్టా సునీల్, ఉప్పలూరి సునీల్, వీరంకి నరేష్, కలపాల వజ్రాలు, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

1,728 మందికి 'వాహన మిత్ర'

పెనమలూరు: నియోజకవర్గంలో 1,728 మందికి వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద నగదు అందిస్తున్నామని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ నియోజకవర్గ పరిధిలో 1728 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. పెనమలూరు మండలంలో 271 మంది, వైఎస్సార్ తాడిడప మునిసిపాలిటీలో 852 మంది, ఉయ్యూరు మండలంలో 265 మంది, కంకిపాడు మండలంలో 340 మంది చొప్పున లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరికి శుక్రవారం బ్యాంకు ఖాతాలో రూ. 10 వేల చొప్పున సొమ్ము ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు.

క్రైస్తవ బీసీ (సీ)లకు సర్టిఫికెట్‌లు ఇవ్వాలి

రామవరప్పాడు: అర్హులైన క్రైస్తవ బీసీ(సీ)లకు సర్టిఫికెట్లు మంజూరు చేయాలని రాజ్యాంగబద్ధమైన భారతీయ క్రైస్తవుల సంఘం (సీఐసీ) వ్యవస్థాపకుడు వరదాన్ దేవదాసి అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు రామానగర్‌లోని చర్చిలో గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల బీసీ(సీ) సంఘ పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ(సీ)లకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి తహసీల్దార్‌లు వ్యతిరేకిస్తున్నారన్నారు. అర్హులైన వారికి బీసీ(సీ) సర్టిఫికెట్ ఇచ్చేలా చట్ట ప్రకారం గైడ్ లైన్స్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ(సీ)లకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. బైబిల్ కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం స్థలాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు జీవన్‌రాజు, యేసుదాసు, ప్రసన్నకుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు రంగనాయక స్వామి పవిత్రోత్సవం

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయకస్వామి వారి పవిత్రోత్సవం గురువారం రెండో రోజు కొనసాగింది. ఆలయంలో గురువారం ఉదయం, సాయంత్రం పూజాదికాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

నవయుగ కవితా చక్రవర్తికి స్వర నీరాజనం



విజయవాడ కల్చరల్: ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గురువారం గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. కారుమంచి రాజు మాట్లాడుతూ కవిగా, నాటక రచయితగా జాషువా తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. నాటి యువకులను ఎందరినో ప్రభావితం చేసినట్లు తెలిపారు. సినీ సంగీత విభావరిలో భాగంగా ఆదిరాల జయప్రభు, రమాశంకర్, కొమ్మినేని రత్నకుమారి, పావని, శ్రావణి, శ్రీనివాసరావు తెలుగు చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు జాషువా చిత్రపటానికి నివాళి సమర్పించారు.